క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

భీమవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, జి.ఆస్కారరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఈసీ సభ్యుల సమావేశం ఆదివారం భీమవరంలోని అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి నుంచి సంఘాన్ని మరింత పటిష్టం చేసుకోవాలన్నారు. సమావేశంలో జి.సత్యనారాయణ, రమేష్ కుమార్, నాగ సాయి, బీహెచ్ రవీంద్ర రాజు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

వీఈసీ ప్రిన్సిపాల్‌గా కృష్ణ కాంత్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణకాంత్

వీరవాసరం: వీరవాసరం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వీఈసీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణకాంత్ తెలిపారు. వీరవాసరంలోని వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నూతన ప్రిన్సిపల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కృష్ణకాంత్‌ను ఎం.బలరాం, సీహెచ్ ప్రభువరం, నరగన సురేష్ తదితరులు అభినందించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద పురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ట సందర్భంగా యాగశాలలో హోమం కార్యక్రమాలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠించనున్న నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జార్జ్‌ముల్లర్‌కు అభినందన సత్కారం


జార్జ్ ముల్లర్ దంపతులను సత్కరిస్తున్న చెరుకువాడ సీబీసీఎన్‌సీ సంఘ ప్రతినిధులు

ఉండి: ఇటీవలే సిరంపూర్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆదివారం చెరుకువాడ ఇమ్మానుయేలుపేట సీబీసీఎన్‌సీ చర్చ్‌లో సంఘ పక్షంగా డాక్టర్ ఎస్ జార్జ్‌ముల్లర్‌ను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీ చర్చ్ ఏర్పడి 150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆధ్యాత్మిక యూనివర్సిటీ అయిన సిరంపూర్ నుంచి గౌరవ డాక్టరేట్ లభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టి.మత్తయి, మారేష్, మోహన్‌రావు, సీఆర్ థామస్, యోబు, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

30న రన్ ఫర్ జీసస్

నరసాపురం: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రతీఏటా నిర్వహిస్తోన్న రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం ఈ నెల 30న నరసాపురంలో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమం కో–ఆర్డినేటర్ సంజయ్‌కిషన్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు థామస్‌బ్రిడ్జి వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో అనేక మంది పాస్టర్లు, క్రైస్తవ ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. క్రీస్తు పునరుద్ధాన మహిమను వివరిస్తూ రన్‌ఫర్ జీసస్ పేరుతో సాగే 10కే రన్‌ను 2011 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. నరసాపురం ప్రాంతంలో క్రైస్తవానికి విశిష్టత, శతాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్యానర్లు, జెండాల తొలగింపు

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి సంబంధించిన భవనాలు, కార్యాలయాలపై ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించే పనులు చేపట్టారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ సిబ్బంది అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల భవనాలపైన ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం


టీటీడీ బోర్డ్ మాజీ మెంబర్ రామరాజుతో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


పీవీఎల్‌కు ఉండి టిక్కెట్ ఇచ్చినందుకు ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ నివాసం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల/ఆకివీడు: నియోజకవర్గంలో పార్టీ పెద్దలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వెళ్లి ఉండిలో వైఎస్సార్ సీపీ జెండాను కచ్చితంగా ఎగురవేయడం ఖాయమని డీసీసీబీ చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు ధీమా వ్యక్తంచేశారు. టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజును పీవీఎల్ నరసింహరాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామరాజు పీవీఎల్ నర్సింహారాజు ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉండి నియోజకవర్గంలో ఈసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం అభివృద్ధి పీవీఎల్ ను గెలిపిస్తుందని స్పష్టం చేశారు. టీడీపీ కంచుకోట బద్ధలుకావడం ఖాయమని, అన్ని వర్గాల ప్రజలు జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సంక్షేమం అభివృద్ధి అందించడంలో పీవీఎల్ ప్రత్యేక పాత్ర వహించారని అభినందించారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహారాజు మాట్లాడుతూ నియోజవర్గం లో పార్టీ పెద్దలు ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. అన్ని గ్రామాలలోను ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలు పొందుతూ ఎంతో ఆనందంగా ఉన్నారని చెప్పారు. అనంతరం క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు నివాసంకు వెళ్లి ఆయన మద్దతు తీసుకున్నారు. ఆకివీడు మండలంలోని పెదకాపవరం గ్రామంలోని సీనియర్ నాయకులు, కాపు కుల పెద్ద కర్రెడ్డి కుసుమేశ్వరరావు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కుసుమేశ్వరరావు శాలువా కప్పి ఆశీర్వదించారు. పీవీఎల్ వెంట భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, కాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీషా విశ్వనాథరాజు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు గిఫ్ట్‌గా ఉండి సీటు

ఆకివీడు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి ఉండి నియోజకవర్గంను గిఫ్టుగా అందజేస్తామని ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ చెప్పారు. ఉండి అసెంబ్లీ టిక్కెట్‌ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు ఇచ్చినందుకు శనివారం ఆమె నివాసం వద్ద పీవీఎల్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో వైఎస్సా ర్‌సీపీ జెండాను ఎగురవేసి, పీవీఎల్‌కు విజయం చేకూర్చే విధంగా యువత ముందుకు వస్తుందని రసూల్‌బీబీ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎస్కే హుస్సేన్, ఏసోబు, బద్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రహదారి నిర్మాణ పనులు


రహదారి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

వీరవాసరం: పంజా వేమవరం– రాయకుదురు రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి అవుతున్నాయి. రాయకుదురు సర్పంచ్ గెద్దం భారతి ఆదివారం నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారధ్యంలో, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పురోభివృద్ధి పెద్ద ఎత్తున కొనసాగుతుందన్నారు. రూ.2.90 కోట్ల నిధులతో రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి కావస్తుండడం ఎంతో ఆనందం ఇస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యం ద్వారా ఉద్యోగాలు


విష్ణు కళాశాల వార్షికోత్సవాల్లో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాల అలవర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వార్షికోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కమ్యునికేషన్ స్కిల్స్ పెంచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సొసైటీలో 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. అనంతరం జేఎన్‌టీయూకే పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణు, కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, అడ్మిన్ ప్రసాదరాజు, ఏజీఎం రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


మొగల్లులో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: రాబోయే ఎన్నికల్లో నిర్భయంగా, ఓటు వేయాలని మీకు మేమున్నాం అంటూ ఆదివారం పోలీసులుకవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో భీమవరం రూరల్ సీఐ వై.సత్య కిషోర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఈ కవాతు నిర్వహిస్తున్నామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాళం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు ప్రజలు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మాధవరంలో స్వామివారి విగ్రహం పునఃప్రతిష్ఠించిన దృశ్యం, పోటెత్తిన భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో కోతిగుంట చెరువు గట్టున వేంచేసియున్న ఆంజనేయ స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి గంధం దొరబాబు ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా ఇక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయంనుంచి ప్రత్యే క పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదృష్టి అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం శిఖరంపై బూరెలు పోసే కార్యక్రమం జరిగింది. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


శ్రీరామభక్తాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: వరిఘేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామభక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం హోమాలు, పూర్ణాహుతి, గోదర్శనం పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అడ్డాల వెంకటరత్నంబాబు, జానకి దంపతులచే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజాదికాలను జరిపారు. బుచ్చిరామశాస్త్రి సిద్ధాంతి ఆధ్వర్యంలో మంగళంపల్లి ఆంజనేయశర్మ బ్రహ్మత్వంలో ఆగమ పండితులచే శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఆంజనేయస్వామివారిని దర్శించి తరించారు.

కవి బ్రహ్మయ్యకు సాహితీ పురస్కారం


బ్రహ్మయ్యను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తనలో చెలరేగిన అనేక భావ సంఘర్షణలకు అక్షరరూపం ద్వారా వచ్చిన కవిత్వాలను ఆదరించిన పాఠకులకు, సాహితీ వేత్తలకు ప్రముఖ కవి కొప్పర్తి వేంకట రమణమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు భవనంలో రసధుని ఆధ్వర్యంలో పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొప్పర్తి వెంకట రమణమూర్తికి పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కారం అందించారు. కొప్పర్తి మాట్లాడుతూ సాహిత్య రంగంలో తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పురస్కారం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రసధుని సభ్యులు కొట్టి భాస్కరరావు, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, పెనుమాక రామ్మోహనరావు, భూపతిరాజు విశ్వనాథరాజు, రెంటాల వెంకటేశ్వరరావు, సుంకర గోపాల్, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసమే పొత్తు


పెనుగొండ: రాష్ట్ర ప్రయోజనాలకు కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీలు స్వప్రయోజనాలకే పొత్తు పెట్టుకున్నాయని రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణు మాధవ రెడ్డి విమర్శించారు. ఆదివారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఒకరిన్ని ఒకరు తిట్టుకుంటూ తన్నుకొన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వనంటూ సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రిపై రాళ్లు వేయించిన ఘన చరిత్ర చంద్రబాబుదని, రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ దేశ ప్రధానిని విమర్శించిన నిలకడలేని వ్యక్తిత్వం పవన్‌దని విమర్శించారు. వీరికి ప్రజల సంక్షేమం అవసరం లేదన్నారు. అధికారం కోసం అనైతిక పొత్తులతో కలిసారన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం తప్ప వీరికి రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరని, సీఎం జగన్‌ను తట్టుకోలేరన్నారు. ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా ఉన్నారని, రాబోయే రోజుల్లో తేటతెల్లం అవుతుందన్నారు.

శరవేగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు


సిమెంట్ రోడ్డు పనులు నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామంలో రెండో విడత గడప గడపకూ మన ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏనుగువానిలంక మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వినుకొండ రవి చెప్పారు. గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. గత ఐదేళ్లలో ఏనుగువానిలంకలో ప్రతి వార్డులో అభివృద్ధి చేశామన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగనన్నది అన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలన్నీ తమ ఇంటికే రావాలంటే ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పని చేయాలని ఆ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) పిలుపునిచ్చారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆలయాల చైర్మన్‌లు గుడాల గోపిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో పాలకొల్లు నుంచి గెలిచి రావాలని ఆశీర్వదించి పంపించారన్నారు. పార్టీ ముఖ్య నాయకులందరినీ సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. రానున్న రెండు నెలలు తన విజయం కోసం కీలకంగా పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి నామినేటెడ్, ఇతర పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అంబేడ్కర్ సేన కార్యకర్తలు ర్యాలీగా వచ్చి గోపిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. అలాగే శంభునిపేటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శంభునిపేటలో పెద్దలను కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట రత్నరాజు, గుమ్మాపు సూర్యవరప్రసాద్, శంకరావు శ్రీను, జోగాడ ఉమామహేశ్వరరావు, ఉచ్చుల స్టాలిన్, బళ్ల రాజశేఖర్, పసుపులేటి వీరాస్వామి తదితరులు గోపిని కలిసిన వారిలో ఉన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కాళ్ల: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాళ్ల మండలంలో ఏర్పాటు చేసిన కాళ్ల హైస్కూల్లో 340, కోపల్లెలో 320, కలవపూడిలో 138, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్లో 223 మంది చొప్పున మొత్తం 1022 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఆదివారం తెలిపారు. 18 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ప్రతీరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు జరగనున్నాయి. 18న తెలుగు, 19న హిందీ, 20న ఆంగ్లం, 22న గణితం, 23న భౌతిక శాస్త్రం, 26న బయాలజీ, 27న సాంఘికశాస్త్రం పరీక్షలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

భీమవరంలో...

భీమవరం అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నిర్వహించనున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి గ్రేడ్–2 వేంద్ర వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలో చినఅమిరం, తుందుర్రు, అనాకోడేరు, గూట్లపాడు, దిరుసుమర్రు పరీక్షా సెంటర్లలో సుమారు 1250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తదనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగే ఈ పబ్లిక్ పరీక్షలకు తాగునీరు, ఉచిత వైద్యశిబిరాలను తదితన అన్ని మౌళిక ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా హాలులోకి సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థులు పరీక్షా సెంటర్‌కు గంట ముందు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వరరావు కోరారు.

దంతాల్ని పరిరక్షించుకోవాలి

ఆకివీడు: దంతాలను సంరక్షించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త చుండూరి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక దుంపగడప రోడ్డులోని ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు, విష్ణు డెంటల్ కాలేజీ సంయుక్తంగా ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దంతాల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. వైద్యులు కె.చైతన్య రామ్ మాట్లాడుతూ దంతాల్ని నిర్లక్ష్యం చేస్తే ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని చెప్పారు. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్ నేరెళ్ళ పెదబాబు, కౌన్సిలర్ గేదల అప్పారావు, కొట్టు ఆంజనేయులు, వాడపల్లి రాంబాబు, ట్రస్టు అధ్యక్షులు నడిపూరి రమణ, మజ్జి శ్రీను, కె.తవిటినాయుడు, కోమటి రాంబాబు పాల్గొన్నారు.

గోరీలగుంట అభివృద్ధి


గోరీలగుంట ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న పురావస్తు శాఖ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న గోరీలగుంట స్థలాన్ని అభివృద్ధి చేయడానికి పురావస్తు శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆదివారం గోరీలగుంట ప్రాంతాన్ని పురావస్తు శాఖ అధికారులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు మాట్లాడుతూ గతంలో డచ్ వారు మన ప్రాంతాన్ని పరిపాలించేవారు. అప్పుడు వారి సమాదులు ఇక్కడ ఉండేవి. వాటిని తవ్వకాలు చేసినప్పుడు వచ్చిన కొన్ని అవశేషాలను విజయవాడ బాపు మ్యూజియంలో నిక్షిప్తపరచామన్నారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక ప్రదేశంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పురావస్తు శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించాలని మునిసిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రాంతం మొత్తం 35 సెంట్లు భూమి ఉండాలన్నారు. చాలా వరకూ ఈ స్థలం అన్యాక్రాంతమైందని తెలిసి ఈ స్థలాన్ని కొలత కొలిచి అప్పగించచాలని తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేశామని అన్నారు. ఈ స్థలాన్ని శుభ్రం చేసి ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. సమాచార హక్కు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ దుర్గాప్రసాద్ అన్యాక్రాంతమవుతున్న ఈ గోరీలగుంట ప్రాంతాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని పురావస్తు శాఖ అధికారులకు ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారని తెలుస్తుంది.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఏర్పాట్లను ఈఓ డి.రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.